

బూచేపల్లి నూతన సంవత్సర శుభాకాంక్షలు


ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ

దర్శి: నూతన సంవత్సరం సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ నూతన సంవత్సరంలో జిల్లా ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని కోరారు. పాడిపంటలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

విద్యార్థుల్లో నైపుణ్యం వెలికి తీసేందుకే వైద్య విజ్ఞానం

పెద్దారవీడు: విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు విద్యా వైజ్ఞానం అవసరమని ఎంఈఓ పి.శ్రీనివాసులు అన్నారు. మండల కేంద్రం పెద్దారవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్‌ఎం జి.శ్రీధర్ ఆధ్వర్యంలో మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన మంగళవారం నిర్వహించారు. వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహిస్తే విద్యార్థులు ఉత్తేజితులవుతారన్నారు. విద్యతో పాటు శాస్త్ర సాంకేతిక రంగాలపై సృజనాత్మకంగా ఆసక్తి పెంచుకోవాలని కోరారు. విద్యార్థులు తయారు చేసిన భౌతిక శాస్త్రం, రసాయనిక శాస్త్రం, జీవ శాస్త్రం, గణితం, పర్యావరణం తదితర అంశాల్లో వివిధ ప్రాజెక్టులు ప్రదర్శించారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు, బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేతగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి వ్యవహరించారు. జెడ్పీహెచ్, ప్రాథమికోన్నత పాఠశాలలు, కేజీబీవీ బాలబాలికలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాళ్లూరు: మండల స్థాయిలో మంగళవారం జరిగిన సైన్స్‌ఫేర్‌లో తాళ్లూరు విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. వ్యక్తిగత విభాగంలో రజానగరం ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థి జే.దానియేలు గ్లోబల్ వామింగ్‌లో ప్రతిభ కనబరిచారు. బృందం విభాగంలో బొద్దుకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9 తరగతి విద్యార్థులు డి. గోవర్ధన్, ఎం.అర్జున్‌లు ప్లాస్టిక్ బ్యాగ్ రీయూజ్‌లో ప్రతిభ కనబరిచారు. టీచర్ విభాగంలో వెలుగోరుపాలెం ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు ప్రదర్శించిన న్యూట్రీ టూల్స్‌లో ప్రతిభ కనబరిచారు. జిల్లా స్థాయికి ఎంపికైన వీరిని పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

ఏపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ రమాదేవి, ఉపాధ్యాయులు

దర్శి: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం ఆవరణలో ఏపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను ఎంఈఓ బి.రమాదేవి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫెడరేషన్ తరఫున ఉపాధ్యాయులకు, సమాజానికి సేవలందించాలని కోరారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు రంగస్వామి, కోటేశ్వరరావు, బసవయ్య, రాఘవరావు, వేణు, వేమా రమణయ్య, ఎంవీ నరసింహం, బీవీ నారాయణ, లోకిరెడ్డి వెంకటేశ్వర్లు, వి.చక్రధారి, వేరువ శ్రీను, సాంబయ్య, ఐవీఎల్ నారాయణ పాల్గొన్నారు.

పింఛన్ నగదు చోరీ

- రికవరీతో ఊపిరి పీల్చుకున్న సచివాలయ సిబ్బంది

కురిచేడు: పింఛన్ నగదు పంపిణీ సమయంలో రూ.74 వేలు చోరీకి గురైన సంఘటన మండలంలోని పొట్లపాడు సచివాలయంలో మంగళవారం జరిగింది. వివరాలు.. డిజిటల్ అసిస్టెంట్ ఆర్.రాంబాబు పొట్లపాడు గ్రామానికి చెందిన చలంచర్ల బాల అంకమ్మకు వృద్ధాప్య పింఛన్ అందజేసేందుకు సచివాలయం నుంచి బయటకు వచ్చి అరుగుపై కూర్చున్నాడు. బాల అంకమ్మకు తోడుగా ఆమె కుమారుడు యోగయ్య కూడా వచ్చాడు. ఆ సమయంలో డీఏ రాంబాబు ఫోన్ రింగ్ కావటంతో నగదు సంచిని అరుగుపై వదిలేసి సచివాలయంలోని తన గదిలోకి ఫోన్ కోసం వెళ్లాడు. బాల అంకమ్మ కుమారుడు యోగయ్య నగదు సంచి తీసుకుని ఉడాయించాడు. రాంబాబు బయటకు వచ్చే సరికి యోగయ్యతో పాటు నగదు సంచి లేక పోవడంతో అనుమానం వచ్చిన రాంబాబు మిగిలిన సిబ్బందిని, పంచాయతీ కార్యదర్శి వివేక్‌ను పిలిచి జరిగిన విషయం తెలిపాడు. పోలీసులకు సమాచారం ఇచ్చి గ్రామంలో యోగయ్య కోసం వెతికారు. సెంటర్‌లో ఉన్న యోగయ్యను తీసుకొచ్చి నగదు ఇవ్వమని ఒత్తిడి చేయడంతో సచివాలయం వెనక చెట్లలో పేపర్లో చుట్టిపెట్టిన నగదు తెచ్చి ఇచ్చాడు. దీంతో సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

మద్యం మత్తులో భార్యపై కత్తితో దాడి

యర్రగొండపాలెం: మద్యం మత్తులో భార్యపై కత్తితో దాడి చేసిన సంఘటన స్థానిక అయ్యప్ప నగర్‌లో సోమవారం రాత్రి జరిగింది. త్రిపురాంతకం మండలం మిట్టపాలేనికి చెందిన మల్లయ్య, లక్ష్మి దంపతులు పనుల కోసం యర్రగొండపాలెంలో నివాసం ఉంటున్నారు. సోమవారం రాత్రి మద్యం తాగి ఇంటికి వెళ్లిన మల్లయ్యను లక్ష్మి వారించింది. దీంతో వారిద్దరి మధ్య కాసేపు ఘర్షణ జరిగింది. మల్లయ్య కత్తి తీసుకొని ఆమె మెడపై, చేతులపై తీవ్రంగా గాయపరిచాడని పోలీసులు తెలిపారు. గాయాలపాలైన ఆమె స్థానిక వైద్యశాలలో చికిత్స పొందుతోంది. కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు ఎస్సై పి.చౌడయ్య తెలిపారు.

సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన పీఓ

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వెంకట శివప్రసాద్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యశాలలోని సదుపాయాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక ఆరోగ్య కేంద్రంలోని బర్త్ వెయిటింగ్ గదుల మరమ్మతుల కోసం రెండు లక్షల రూపాయల నిధులు కేటాయించినట్లు చెప్పారు. దీనికి తోడు వైద్యశాలలకు సంబంధించిన గేట్లను తెరిపించి ఆయా ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. వైద్యశాల సూపరింటెండెంట్ మహేశ్వరి పాల్గొన్నారు.

బీజేపీ కన్వీనర్‌గా కురంగి

కురిచేడు: భారతీయ జనతా పార్టీ మండల కన్వీనర్‌గా కురంగి నాగేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక దర్శి రోడ్డులోని పెట్రోల్ బంకు ఆవరణలో మంగళవారం జరిగిన సమావేశానికి పార్టీ ముఖ్య నాయకులు ఎన్నిక నిర్వహించారు. పార్టీ రిటర్నింగ్ అధికారి మాడపాకుల శ్రీనివాసరావు నాగేశ్వరరావుకు నియామక పత్రం అందజేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శిరసనగండ్ల శ్రీనివాసరావు, రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు ఉన్నం శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కుకట్ల నాగేశ్వరరావు, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి జే.ఆంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షుడు తిండి నారాయణరెడ్డి పాల్గొన్నారు.































విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్‌తో పదో తరగతి విద్యార్థులు

దొనకొండ: మండలంలోని మల్లంపేట జెడ్పీ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు పద్మనాభరావు ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను మంగళవారం పంపిణీ చేశారు. బూచేపల్లి వెంకాయమ్మ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ తరఫున దర్శి ఎమ్మెల్యే, జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఆదేశాల మేరకు గ్రామ నాయకులు కాలూరి రమణయ్య, గుమ్మా ఆదినారాయణ, దూదేకుల ఇస్మాయేల్, యర్రగొర్ల బాలకృష్ణ, ముడమంచు చిన్న ముసలయ్య, ఉప సర్పంచ్ చింతగుంట్ల నాగార్జున, స్వామిదాసు చేతుల మీదుగా విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. బూచేపల్లి వెంకాయమ్మ, డాక్టర్ శివప్రసాదరెడ్డికి పాఠశాల ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

అధికారులతో సమీక్ష సమావేశం

దొనకొండ: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జిల్లా డిప్యూటీ సీఈఓ, మండల ప్రత్యేకాధికారి పి.బాలమ్మ మంగళవారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన పనుల ప్రగతి గురించి చర్చించి ఉపాధి సిబ్బందికి సూచన, సలహాలు అందజేశారు. ఉపాధి పనులకు సంబంధించి బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు.

























